ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

మంగళవారం 25 జూన్ 2024

సింగరేణి
నైనీ ప్రాజెక్టుకు పూర్తి సహకారం 8లో..

యథేచ్ఛగా 'బొక్కలవాగు' భూముల కబ్జా 8లో..

బయటపడుతున్న బోగస్ నల్లా కనెక్షన్లు



- జిల్లాలో కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే
- ఒక్కో గ్రామంలో 10 నుంచి 20 శాతం కనెక్షన్లు
- కొత్త కనెక్షన్ల కోసం పెరుగుతున్న డిమాండ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ పథకంపై చేపడుతున్న ఇంటింటి సర్వేలో బోగస్ నల్లా కనెక్షన్లు బయట పడుతున్నాయి. పాత కనెక్షన్లను కొత్తగా ఇచ్చినట్లుగా, ఒక ఇంట్లో ఫిజికల్‌గా ఒకటే కనెక్షన్ ఉంటే రికార్డుల్లో ముగ్గురు, నలుగురి పేరిట కనెక్షన్లు ఇచ్చినట్లుగా అక్రమాలు బయట పడుతున్నాయి. కొత్త కనెక్షన్లు కావాలనే డిమాండ్ పెరుగుతున్నది. మిషన్ భగీరథ పథకం ద్వారా ఎన్ని నల్లా కనెక్షన్లు ఇచ్చారు. వాటి ద్వారా ఏ మేరకు నీటి సరఫరా జరుగుతున్నది, ఇంకా ఎన్ని కనెక్షన్లు ఇవ్వాలి, తదితర అంశాలపై ప్రభుత్వం ఈ నెల 10వ తేదీ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖను ఇంటింటి సర్వేకు ఆదేశించింది. ఈ నెల 20వ తేదీ వరకు సర్వే పూర్తి చేయాలని ఆదేశించినప్పటికీ, ఇంకా సర్వే కొనసాగుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చి సురక్షితమైన మంచినీటి అందించేందుకు గాను మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చారు. ఈ పథకం ద్వారా అప్పటి ప్రభుత్వం సుమారు 40 వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చించింది. ఈ పథకాన్ని రెండు విభాగాలుగా చేపట్టారు. మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రావిలేజ్ వేర్వేరుగా చేపట్టారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నుంచి నీటిని ఫిల్టర్ బెడ్‌లకు తరలించి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా గ్రామాలు, పట్టణాలకు బల్క్ వాటర్‌ను సరఫరా చేస్తున్నారు. ఇంట్రా విలేజ్ పథకంలో గ్రామంలో అప్పటికే ఉన్న ఓహెచ్ఎస్ఆర్‌లకు తోడు మరిన్ని కొత్త ట్యాంకులను నిర్మించారు. పాత పైప్‌లైన్లకు బదులు కొత్తగా పైపులైన్లు వేసి ఇంటింటికి కొత్త కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ పథకాన్ని 2015-16లో చేపట్టారు. 2018 ఎన్నికల నాటికి పూర్తి చేశామని ప్రకటించింది. ఇంట్రా విలేజ్ పథకానికి సంబంధించి పైపులు, ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు కావాల్సిన పైప్, ట్యాప్‌లను నేరుగా ప్రభుత్వమే మెటీరియల్ పంపించింది. దీని కింద ఒక్కో కనెక్షన్‌కు మెటీరియల్ ఖర్చు 1900 రూపాయల వరకు బిల్లులు చేసినట్లు సమాచారం. నల్లా బిగించినందుకు 329 నుంచి 409 రూపాయల వరకు చార్జీ ఇచ్చారు. మిషన్ భగీరథ పథకం ఎంతకు వరకు సక్సెస్ అయ్యింది, అసలు నీళ్లు అందుతున్నాయా, లేదా, ఇచ్చిన కనెక్షన్లు అన్ని ఉన్నాయా, లేదా, ఇంకా కొత్త కనెక్షన్లు ఎన్ని అవసరం అనే విషయమై తెలుసుకునేందుకు ప్రభుత్వం సర్వేకు ఆదేశించింది.. ఈ నెల 10 నుంచి ఈ సర్వే ప్రారంభం కాగా ఇంకా కొనసాగుతోంది. ఇంకా ఎన్ని ఇళ్లకు కనెక్షన్లు కొత్తగా ఇవ్వాలి, ఉన్న కనెక్షన్లు పాతవా, కొత్తవా, నీళ్లు వస్తున్నాయా, లేదా, ప్రతి రోజు వస్తున్నాయా, దినం తప్పించి దినం వస్తున్నాయా, ఇంటి యజమాని పేరు, ఆధార్, సెల్ ఫోన్, ఇంటి నంబర్లు, కుటుంబసభ్యుల వివరాలను పంచాయతీ కార్యదర్శులు యాప్‌లో నమోదు చేస్తున్నారు.

● ఇప్పటి వరకు 80,357 ఇళ్లలో సర్వే..

ముందుగా ఆయా గ్రామాల వారీగా మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ పథకం అధికారులు నల్లా కనెక్షన్ల జాబితాలను అందజేశారు. ఆ జాబితాలను అనుసరించి సర్వే చేస్తున్నారు. జిల్లాలోని గ్రామాల్లో 1,18,657 ఇళ్ల నల్లా కనెక్షన్ల వివరాలను మిషన్ భగీరథ అధికారులు పంచాయతీ అధికారులకు అందజేశారు. పంచాయతీ సిబ్బంది ఇప్పటి వరకు 80,357 ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. ఇంకా 38,300 ఇళ్లు సర్వే చేయాల్సి ఉంది. మొత్తానికే నల్లా లేని ఇళ్లు 29,023 ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ సర్వేలో అనేక విషయాలు బయట పడుతున్నాయి. చాలా గ్రామాల్లో అప్పటికే ఉన్న నల్లా కనెక్షన్లను కొత్తగా బిగించినట్లు నమోదు చేశారని, ఒక ఇంట్లో కుటుంబసభ్యుల పేరిట 3,4 కనెక్షన్లు ఉన్నట్లు రికార్డుల్లో పేర్కొనగా, కానీ ఆ ఇంటికి ఒక్క కనెక్షన్ మాత్రమే ఉన్నట్లు సర్వేలో బయట పడుతున్నది. మరికొన్ని గ్రామాల్లో మరణించిన వారి పేరిట కనెక్షన్లు ఉన్నాయి. ఖాళీ స్థలాల్లో కూడా నల్లా కనెక్షన్లు బిగించడం వంటివి సర్వే ద్వారా తేటతెల్లం అవుతున్నాయి. నల్లా కనెక్షన్ లేకున్నా, ఉన్నట్లు మిషన్ భగీరథ ఇంట్రా అధికారులు నమోదు చేసిన వివరాలన్నింటినీ సర్వే సిబ్బంది ప్రభుత్వానికి రిపోర్టు చేస్తుండడంతో సంబంధిత అధికారులు అలా చేయవద్దని ఒత్తిడి తీసుక వస్తున్నారని సమాచారం. ఈ విషయమై ప్రభుత్వం విజిలెన్స్ అధికారులచే విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు బయట పడే అవకాశాలున్నాయి. అక్రమాలు బయట పడతాయని ప్రజలు అంటున్నారు.



పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల వివరాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి, తదితరులు

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ



డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. జిల్లాకు కొత్తగా కలెక్టర్ రావడంతో సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేతబట్టుకుని ప్రజలు వచ్చి కలెక్టర్ శ్రీహర్షకు దరఖాస్తులను అందజేశారు. ఒక్కొక్కరుగా తమ సమస్యల గురించి వివరించేందుకు వచ్చిన వారి నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో, మూకుమ్మడిగా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారి నుంచి కలెక్టరేట్ ఎదుటకు వచ్చి వారి దరఖాస్తులు స్వీకరించి తమ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. రామగుండంలో లక్కీ డ్రా ద్వారా ఎంపికైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు మూకుమ్మడిగా కలెక్టరేట్‌కు వచ్చి ఆ ఇళ్లను తమకు కేటాయించాలని కోరుతూ కలెక్టర్‌కు దరఖాస్తు ఇచ్చారు. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఎండీ రెహాజుద్దీన్ తాను ఎంఏ ఇంగ్లీష్, పీజీడీసీఏ చేశానని, తనకు ఎక్కడైనా ఉద్యోగం కల్పించాలని కోరారు. కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట్‌కు చెందిన దాముక వెంకటమ్మ తన భర్త మరణించారని, తనకు ప్రభుత్వం అందజేసే వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఎం సురేష్ భూసమస్యను పరిష్కరించాలని కోరారు. వీటిపై స్పందించిన కలెక్టర్ సత్వరమే దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వచ్చే వారికి ఉచిత మధ్యాహ్న భోజనం : కలెక్టర్

పెద్దపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తుదారులకు మధ్యాహ్నం ఉచితంగా భోజన సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ ఉచిత భోజన సౌకర్యాన్ని అదనపు కలెక్టర్‌లు జె అరుణశ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి తమ సమస్యలు తెలుపుకునేందుకు వచ్చే దరఖాస్తుదారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించేందుకు లయన్స్ క్లబ్ ముందుకు రావడం అభినందనీయమని దీనిని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎరబాటి వెంకటేశ్వర్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కావేటి రాజగోపాల్, సాదుల వెంకటేశ్వర్లు, బండ బాబురావు, బాలకిషన్ జకోటియా, వేల్పుల రమేష్, మీసాల సత్యనారాయణ, రాంరెడ్డి, పయ్యావుల కొమురయ్య, రాంకిషన్, తూము రవీందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో, పట్టణాలలో రెగ్యులర్‌గా ఫాగింగ్ నిర్వహించాలని, స్థానిక సంస్థల అధికారులు, వైద్యాధి కారులు సమన్వయంతో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ దోమలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓపెన్ డ్రై, నిరుపయోగమైన బావులు గుర్తించి వాటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ వద్ద అవసరమైన మేర బ్లీచింగ్ పౌడర్ స్టాక్ అందుబాటులో ఉండాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు, నీటి వనరులను తనిఖీ చేయాలని, ఎక్కడైనా కట్ట బలహీనంగా ఉంటే వెంటనే మరమ్మత్తులు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యుత్ వైర్లను, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను ఒకసారి చెక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్ గురుకులాలు, మోడల్ పాఠశాలలు, కేజీబీవీలను పంచాయతీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్కడి పారిశుధ్యం, పరిసరాలు, పిల్లలకు సరఫరా చేసే ఆహారం వాటిని పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్, మున్సిపల్ కమిషనర్లు, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, డీపీఓ ఆశాలత, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● సకాలంలో సీఎంఆర్ పూర్తి చేయాలి..

జిల్లాలో గడిచిన ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన సీఎంఆర్‌ను నిర్ధేశించిన గడువులోగా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సీఎంఆర్ రైస్ డెలివరీపై, రేషన్ బియ్యం అక్రమ తరలింపు, నిల్వల నివారణకు తీసుకోవల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమ రేషన్ బియ్యం రవాణా, నిల్వలను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ ప్రేమ్ కుమార్, జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టాస్క్ భవనం ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 24: టాస్క్ భవనం ఆధునికీకరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను సూచించారు. సోమవారం కలెక్టర్ శ్రీహర్ష పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని టాస్క్ భవనాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆధునికీకరణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సౌకర్యవంతంగా, ఆకర్షణీయంగా భవనం పనులు ఉండాలన్నారు. వీలైనంత త్వరగా భవన ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా టాస్క్ మేనేజర్ గంగాప్రసాద్, పీఆర్ ఈఈ గిరీష్‌బాబు, పీఆర్ డీఈ శంకరయ్య, ఏపీఎం సంపత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఆందోళన

పెద్దపల్లిటౌన్, జూన్ 24: గత ప్రభుత్వ హయాంలో డ్రా ద్వారా ఎంపిక చేసిన తమకు తక్షణమే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని రామగుండం నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులు సోమవారం పెద్దపల్లి కలక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం తహసీల్దార్ డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం 660 మంది లబ్ధిదారులకు ఎంపిక చేశారని వాపోయారు. అప్పటి నుంచి ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపికైన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్ రూంలు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో సమ్మయ్య, జమీర్, దేవేందర్, రాజేష్, గోపి, మాధవి, చాయ, సుజాత, అనురాధ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కోడిగుడ్లు పెడతలేరు... కూరలు బాగాలేవు

జడ్పీటీసీకి మొరపెట్టుకున్న విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ తిరుపతి

కాల్వశ్రీరాంపూర్, జూన్ 24: మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు పెట్టడం లేదని, కూరలు బాగా ఉండడం లేదని జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డికి పాఠశాల విద్యార్థులు మొరపెట్టుకున్నారు. సోమవారం జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి మండలంలోని మల్యాల గ్రామ పరిధిలో గల మోడల్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు వంట బాగుండడం లేదని, కోడిగుడ్లు కూడా ఇవ్వడం లేదని జడ్పీటీసీకి వివరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రిన్సిపల్ శ్రీనివాస్‌కు సూచించారు. మధ్యాహ్న భోజనం సరిగా ఉండడంలేని తమ దృష్టికి వచ్చిందని, విద్యార్థులకు మెనూ ప్రకారం గుడ్లు అందించడం లేదని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు కోడిగుడ్లు అందించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను డీఈవో దృష్టికి తీసుకుపోయారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇబ్రహీం ఉన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ఇఫ్టూ ఆధ్వర్యంలో ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పెద్దపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయడంతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ వెంకన్న మాట్లాడుతూ వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు దశాబ్దాలుగా కనీస వేతనాలు ఇవ్వడం లేదని, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు లేక అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. హమాలీ, ఆటో, మోటార్ రంగంలో కొనసాగుతున్న కార్మికులు డ్రైవర్లు నేటికీ భద్రతతో కూడిన సంక్షేమ బోర్డులు గానీ, గుర్తింపు కార్డులు గానీ జారీ చేయడం లేదన్నారు. రాష్ట్రంలో భవన ఇతర నిర్మాణ రంగ కార్మికుల శ్రమ నుంచి ప్రతీ రోజు సెస్సుల రూపంలో లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఖజానాలో జమ అవుతున్నాయని అన్నారు. వీటిని కేవలం భవన నిర్మాణ రంగ కార్మికులకే ఖర్చు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం లాగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఇతర అవసరాలకు ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీహర్షకు దరఖాస్తును అందజేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షులడు ఇ నరేష్, ప్రధాన కార్యదర్శి బి అశోక్, ఉపాధ్యక్షులు చిలుక శంకర్, కోశాధికారి డి బుచ్చమ్మ, జిల్లా నాయకులు ఎం దుర్గయ్య, బి బుచ్చయ్య, తిప్పని రాంకీ, కే ఎల్లయ్య, ఎడ్ల రవికుమార్, మెరుగు చంద్రయ్య, కే మల్లేశం, పి రమేష్,పీ వెంకటస్వామి, ఎం కాంతయ్య, తిర్రి బాలకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాలీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

కోల్‌సిటీటౌన్, జూన్ 24: గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో పాలీసెట్-2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతున్నది. సోమవారం జరిగిన పరిశీలనకు 180 మంది విద్యార్థులు హాజరయ్యా రు. ఈ సందర్భంగా పాలీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ డి సురేష్‌కుమార్ మాట్లాడుతూ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు సంబంధిత లాగిన్ ఐడీ ద్వారా ఈనెల 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వెరిఫికెషన్ అధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ ప్రసాద్, అజయ్‌కుమార్, యాదయ్య, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల సంక్షేమాధికారుల పరీక్ష ప్రారంభం

రామగిరి జూన్ 24: తెలంగాణ రాష్ట్ర వసతిగృహాల సంక్షేమాధికారుల పరీక్ష మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రారంభమైంది. రెండు పూటలా జరిగిన పరీక్షకు మంథని కేంద్రానికి 150 మందిని కేటాయించారు. ఉదయం, మధ్యాహ్నం 110 నుంది హాజరు కాగా 40 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. భారీ బందోబస్తు నడుమ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అభ్యర్థులను మెటల్ డిటెక్టర్ల సహాయంతో తనిఖీలు నిర్వహించి పరీక్షా కేంద్రంలోకి పంపించారు.

పరీక్ష జరుగుతున్న తీరును ఫ్లైయింగ్ స్క్వాడ్, గోదావరిఖని అడిషనల్ డీసీపీ రాజు, మంథని సీఐ ఎం వెంకటేశ్వర్లు, ఎస్ఐలు మధుసూదన్, దివ్య పర్యవేక్షించారు. ఉదయం ఇద్దరు నిర్ణీత సమయానికి రాకపోవడంతో అధికారులు పరీక్ష రాయడానికి అనుమతించలేదు. ఈనెల 29వరకు హాస్టల్ సంక్షేమాధికారి పరీక్షలు జరుగుతాయి.

బ్రిడ్జిపై పేరుకుపోయిన మట్టి తొలగింపు



మట్టి తీయిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్, జూన్ 24: మండలంలోని హుస్సేన్ మియా వాగుపై ఉన్న గంగారం కునారం మధ్య ఉన్న బ్రిడ్జిపై మట్టి పేరుకపోవడంతో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ తన సొంత ఖర్చులతో మట్టిని సోమవారం తొలగించారు. కొన్ని సంవత్సరాలుగా బ్రిడ్జిపై మట్టి పేరుకుపోవడంతో బ్రిడ్జిపై వర్షపు నీరు నిలిచి పెద్దపల్లికి వెళ్లే వాహనదారులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడడంతో మట్టిని తొలగించి నట్లు సారయ్యగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో రేకుల రఘు, బైరి రవికుమార్‌గౌడ్, మేదురు రమేష్, ఓదెలు అశోక్ ఉన్నారు.

మల్లన్న క్షేత్రానికి రూ. లక్ష వితరణ

ఓదెల, జూన్ 24: మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి రిటైర్డ్ జీఎం పులిపాక అర్జున్ రూ. లక్ష నగదు, అలాగే 15 గ్రాముల బంగారాన్ని వితరణ చేశారు. మేడ్చల్ జిల్లా కేంద్రానికి చెందిన అర్జున్ గోదావరిఖనిలో జీఎంగా విధులు నిర్వహించి కొద్దిరోజుల క్రితం పదవీ విరమణ పొందాడు. అంతకు ముందు అనుకున్న కోరిక మేరకు రూ. లక్ష నగదు, బంగారాన్ని ఈవో సదయ్యకు అందజేసి తగిన రశీదును పొందా రు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఎం కుమారస్వామి, ప్రధాన అర్చకుడు వీరభద్రయ్య ఉన్నారు.

అటవీ, విద్యుత్ శాఖల అధికారుల మధ్య వాగ్వాదం

- వాడీవేడిగా ముత్తారం మండల సర్వసభ్యసమావేశం



వాగ్వాదం చేసుకుంటున్న విద్యుత్, అటవీ అధికారులు

ముత్తారం, జూన్ 24: హరితహారం పథకంలో నాటిన చెట్ల నరికివేత రెండు శాఖల అధికారుల మధ్య దుమారం లేపింది. తాము నాటిన మొక్కలను నరికి వేసినందుకు అటవీ శాఖ, విద్యుత్ శాఖ అధికారులకు జరిమానా విధించగా, కరెంట్ లైన్ల కింద మొక్కలను నాటడం వల్ల అవి పెరిగి తీగల ను తాకి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఎలా జరిమానా విధిస్తారంటూ ఆ శాఖాధికారులు వాగ్వాదానికి దిగారు. సోమవారం ముత్తారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జక్కుల ముత్తయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హరితహారం మొక్కల పెంపకంపై జరిగిన చర్చలో అటవీ శాఖ, విద్యుత్ శాఖ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. ప్రతి ఏటా నర్సరీల్లో ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి పెంచుతున్న మొక్కలను కరెంట్ తీగల కింద సంబంధిత అధికారులు నాటుతున్నారని విద్యుత్ ఆధికారలు తెలిపారు. మూడు, నాలుగేళ్ల తర్వాత మొక్కలు పెరిగి కరెంట్ తీగలకు తగలి విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్పిస్తుండడంతో చెట్లను నరికి వేస్తున్నామని విద్యుత్ అధికారులు తెలిపారు. దీంతో అటవీ శాఖాధికారులు విద్యుత్ శాఖాధికారులకు జరిమానాలు విధించారన్నారు. ముత్తారం గ్రామ పంచాయతీ వీధిదీపాల విద్యుత్ బకాయి సూమారు రూ. 60లక్షల ఉన్నట్లుగా ఏఈ హనుమాన్‌దాస్ అన్నారు. అలాగే గ్రామాల్లో మిషన్ భగిరథ నీరు పైపు లైన్‌లు లీక్ అయి ప్రతి ఇంటికి నీరు చేరడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకు వచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే బియ్యంలో పురుగులు వస్తున్నాయని అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే నిర్లక్ష్యం జరుగుతుందని వైస్‌ఎంపీపీ సూదాటి రవీందర్‌రావు ఆరోపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చెల్కల స్వర్ణలత, ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాదవ్, సింగిల్ విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

భగత్‌నగర్, జూన్ 24: జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామారపు వెంకటేష్, మచ్చ రమేశ్ పిలుపునిచ్చారు.

సోమవారం నగరంలోని పార్టీ కార్యాయంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి బైపాస్ రోడ్డులో గల ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నా మని తెలిపారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి నూతన విద్యా విధానం తీసుకొచ్చారని ఆరోపించారు. తెలంగాణ విభజన హామీల్లో తెలంగాణకు రావలసిన నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, ఐఐటీ, ఐఎం లాంటి విద్యా సంస్థలను తెలంగాణకు కేటాయించకుండా మోదీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ఛైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు సమస్యలతో సతమతమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస సదుపాయాలు కల్పించాని డిమాండ్ చేశారు.

బాసర గోదావరిలో చొప్పదండి ఎమ్మెల్యే సతీమణికి పిండప్రదానం



అంతిమసంస్కార కార్యక్రమాలను నిర్వహిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, పిల్లలు

బాసర, జూన్, 24: కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే సత్యం సతీమణి రూప అస్తికలను సోమవారం నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నదిలో కలిపారు. ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే సత్యం భార్య రూప ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే సత్యంతో పాటు కుటుంబ సభ్యులు అంతిమ సంస్కార కార్య క్రమాలను నిర్వహించారు. పిండ ప్రదానం, అస్తికలను ఎమ్మెల్యే సత్యం నదిలో కలిపారు.

డెయిరీ ఫామ్ యజమాని ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): డెయిరీ ఫామ్ యజమాని డి. వంశీ కృష్ణారెడ్డి ఓ హోటల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్ జిల్లా రేకుర్తి మండలం సాలెహ్‌నగర్‌కు చెందిన మల్లారెడ్డి కుమారుడు డి. వంశీ కృష్ణారెడ్డి (27) బాలాపూర్‌లో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. కాచిగూడలోని ఓ హోటల్‌లో ఆదివారం ఉదయం 203 గదిని అద్దెకు తీసుకున్నాడు. సోమవారం ఉదయం రూమ్ ఖాళీ చేస్తానని చెప్పడంతో హోటల్ సిబ్బంది వంశీ కృష్ణారెడ్డి ఉన్న గది తలుపు తడితే తీయలేదు. సిబ్బంది హోటల్ మేనేజర్‌కు ఈ విషయం చెప్పారు. కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు పగులగొట్టి చూడగా వంశీ కృష్ణారెడ్డి చనిపోయి ఉన్నాడు. పక్కన పురుగుల మందు డబ్బా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియవని తెలిపారు.

ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



అంజనను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జూన్ 24: ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీ విభాగంలో జె.అంజన 439/440 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకులో నిలిచింది. ఎంపీసీ విభాగంలో 30 మంది విద్యార్థులు 470 మార్కులకుగాను 468 మార్కులు సాధించారు. 81 మంది విద్యార్థులు 467 మార్కులు, 131 మంది విద్యార్థులు 466 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో స్టేట్ ఫస్ట్ మార్కులతో పాటు నలుగురు విద్యార్థులు 438 మార్కులు, 14 మంది 437 మార్కులు, 34 మంది 436 మార్కులు సాధించారు. ఎంఈసీలో టి.అఖిల్, వి.రిషిత, ఎం.శ్రీవల్లి పటేల్ 500 మార్కులకు 494 మార్కులు సాధించి రాష్ట్రంలోనే అత్యున్నత స్థానం పొందారు. సీఈసీ విభాగంలో బి.గ్రీష్మ, సిహెచ్. నిఖిత 500 మార్కులకు 494 మార్కులు సాధించారు. అన్ని విభాగాలలో అత్యద్భుత ఫలితాలు సాధించడంలో అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమైందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పటిష్ఠ ప్రణాళికతో విద్యా బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషితో ఇంతటి ఘనవిజయం సాధ్యమైందన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను నరేందర్‌రెడ్డి అభినందించారు.

నైపర్‌లో శాతవాహన ఫార్మసీ విద్యార్థులకు ర్యాంకులు



జి. నందిని



వై. స్నేహ



ఎం.సాయికిరణ్

గణేశ్‌నగర్,జూన్ 24: శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిష్ఠాత్మక జాతీయ ఫార్మసీ విద్యా, పరిశోధన సంస్థ (నైపర్) ప్రవేశపరీక్షలో ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే శ్రీశైలం తెలిపారు. ఈ పరీక్షలో జి.నందిని 296, వై.స్నేహ 429, యం.సాయికిరణ్ 1633, జి.ప్రత్యూష 1819, ఏ.లోకేశ్ 2244, బి.వల్లవి 2,327, ఏ.రమ్య 2,661, పి సాయిపూజిత 2931, యం భానుమతి 3324, ఎస్ జగదీష్3940, జి ప్రగతి 5228 ర్యాంకులు సాధించి ఎంఫార్మసీలో ప్రవేశానికి అర్హత సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య లభిస్తుందని, అంతర్జాతీయంగా పేరుగాంచిన శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి రెండు సంవత్సరాల ఎం ఫార్మసీ కోర్సు వ్యవధి కాలంలో ప్రతినెలా 12,400 రూపాయల ఉపకార వేతనం లభిస్తుందని అన్నారు. ప్రవేశానికి అర్హతపొందిన విద్యార్థులను విశ్వవిద్యాలయ ఇంచార్జ్ ఉపకులపతి సురేంద్రమోహన్ ఐఏఎస్, రిజిస్ట్రార్ ఆచార్య యం వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్, అధ్యాపకులు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది విద్యార్థుల డీబార్

గణేశ్‌నగర్, జూన్ 24: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 16 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధి కారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల, ధర్మపురిలో ఆరు గురు, శివాని డిగ్రీ కళాశాల సుల్తానాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథని లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఐదుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో ఒకరు, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో ఒకరు. మొత్తం 16 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిలవడంతో ఇంజినీరింగ్ చేయాలనే తన కల నెరవేరదని మనస్తాపం చెంది తోకల సాక్షి(18) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన తోకల సాక్షి(18) మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్‌లో ఇటీవల ఇంటర్మీడియెట్ చదివింది. వార్షిక ఫలితాల్లో మ్యాథ్స్ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యింది. అనంతరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీతోపాటు ఎంసెట్ రాసింది. ఈ క్రమంలో ముందుగా ఎంసెట్ ఫలితాలు రాగా అందులో అర్హత సాధించింది. సోమవారం విడుదలైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ అయ్యింది. దీంతో ఇంజనీరింగ్ చేయాలనే తన కల నెరవేరడం లేదని మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 24: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో సోమవారం బానోతు అక్షయ(19) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం... కరీంనగర్‌లో నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతున్న అక్షయ పరీక్షల అనంతరం ఇంటికి వచ్చింది. కాలేజీ ప్రారంభం అవుతున్నదున మూడో సంవత్సరానికి సంబంధించిన ఫీజు విషయమై తండ్రిని అడిగింది. ప్రస్తుతానికి డబ్బులు లేవని, జీతం వచ్చాక ఫీజు డబ్బులు ఇస్తానని తండ్రి రాజేషం చెప్పడంతో మనస్తాపంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. అక్షయ చిన్నచిన్న విషయాలకు అలుగుతూ గదిలో తలుపువేసుకుని కొంత సేపటి తర్వాత వచ్చేదని, కానీ సోమవారం సాయంత్రానికి గాని తలుపులు తీయకపోవడంతో తండ్రి రాజేషం తలుపులు పగుల గొట్టి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. మృతురాలి సోదరి అనీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో ఆదివారం రాత్రి దొంగ చోరీకి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎం దొంగతనానికి వచ్చిన వ్యక్తి మిషన్ నుంచి డబ్బులు దొంగిలించేందుకు యత్నించాడు. ఫలితం లేకపోవడంతో వెళ్లిపోయాడు. ఆన్‌లైన్ ద్వారా విషయం తెలుసుకున్న బ్యాంకు అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటన స్థలాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం ప్రత్యేక పోలీసులు వేలిముద్రలను సేకరించారు. సీసీ కెమెరాలో నిక్షిప్తమైన వీడియోను విడుదల చేశారు. చోరీకి విఫలయత్నం చేసిన వ్యక్తిని గుర్తిస్తే 87126 56374, 8712656373, 9000457637 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు గంటలు ఉత్కంఠ

● ఎమ్మెల్సీతో మంత్రి శ్రీధర్‌బాబు మంతనాలు ● కార్యకర్తల నినాదాలతో మారుమోగిన నివాసం
● క్యాడర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మనోవేదన అధిష్టానానికి తెలియజేస్తానన్న మంత్రి



జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాయకులు

జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జగిత్యాలలో గల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి నివాసంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సుమారు రెండు గంటల పాటు గడిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంపై కినుక వహించారన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జగిత్యాలకు వచ్చారు. శ్రీధర్‌బాబు కాన్వాయ్ రావడంతోనే అక్కడ పెద్ద ఎత్తున గుమిగూడిన కాంగ్రెస్ కార్యకర్తలు, జీవన్‌రెడ్డి అభిమానులు జోరున నినాదాలు చేశారు. జీవన్‌రెడ్డి జిందాబాద్, జీవనన్నకు జై జై అంటూ నినదించారు. కార్యకర్తలకు నమస్కరిస్తూ మంత్రి శ్రీధర్ బాబు ఇందిరాభవన్‌లోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. గదికి గడియ వేసుకొని సుదీర్ఘ సమయం పాటు చర్చించారు. ముందుగా ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లతో ముచ్చటించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావుతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో అభిప్రాయాలను, మనో వేదనను పంచుకున్నారు.

ఎమ్మెల్సీ నివాసంలో మంత్రి శ్రీధర్ బాబు ముచ్చటిస్తున్న సమయంలో ఆరుబయట వాకిలిలో, రహదారిపై, ప్రహరీ గోడలపై ఉన్న కార్యకర్తలు, అభిమానులు జీవన్‌రెడ్డికి మద్దతుగా నినదించారు. లోపల ఏమి జరుగుతుందో తెలియక క్యాడర్ అయోమయానికి గురైంది. ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో...ఏమి జరగనుందోనన్న ఆసక్తితో అభిమానులు, కార్యకర్తలు అక్కడే నిలబడి ఆసక్తిగా ఎదురుచూశారు. ఎట్టకేలకు సుమారు రెండు గంటల తరువాత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కార్యకర్తలకు నమస్కరించి అభిప్రాయాన్ని వెల్లడించారు. నిన్నటి రోజున జరిగిన సంఘటనతో ఎమ్మెల్సీ మనస్తాపానికి గురయ్యారన్న సమాచారం తెలుసుకొని మర్యాద పూర్వకంగా కలవడానికి జగిత్యాలకు వచ్చానని ప్రకటించారు. సుదీర్ఘంగా జీవన్ రెడ్డితో మాట్లాడి ఆయన మనోవేదనను, అభిప్రాయాలను తెలుసుకున్నానని స్పష్టం చేశారు. ఇక్కడ చోటుచేసుకున్న పరిస్థితి, క్యాడర్ అభిప్రాయాలు, జీవన్ రెడ్డి మనోవేదనను ఏఐసీసీ, పీసీసీ అగ్రనేతలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తానన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి పెద్ద దిక్కుగా ఉన్నారని, రాబోయే కాలంలో సైతం కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా వ్యవహరిస్తారని ప్రకటించారు. క్యాడర్ అధైర్య పడొద్దని కోరారు. జీవన్‌రెడ్డి నివాసానికి అధిక సంఖ్యలో జనం రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వ హించారు. జీవన్‌రెడ్డి నివాసానికి వచ్చే రహదారులను బారీగేట్లతో మూసి వేశారు. వాహనాల రాకపోకలను నియంత్రించారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లో 7 తులాల బంగారం, లక్ష నగదు

జమ్మికుంట మండలం కొత్తపల్లిలో లక్ష నగదు, బంగారం అపహరణ



కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లో క్లూస్ టీం తనిఖీలు

కోరుట్ల రూరల్, జూన్ 24 : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. పోలీసులు..బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ తెడ్డు రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి ఆదివారం రాత్రి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి పక్కనే ఉన్న వారు తలుపు తీసి ఉన్న విషయాన్ని గుర్తించి రమేష్ కు సమాచారం అందించారు. హుటాహుటిన రమేష్ ఇంటికి చేరుకుని చూడగా ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో పాటు ఇంటిలోని సామగ్రి చిందర వందరగా పడిఉన్నాయి. బెడ్ రూంలో ఉన్న బీరువాలోని వస్తువులు తీసి బయట పడేసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే కోరుట్ల పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సురేష్ బాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బీరువాలో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు, లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధితుడు రమేష్ పిర్యాదు పేర్కొన్నాడు.



జమ్మికుంట మండలం కొత్తపల్లిలో చిందర వందరగా పడేసి ఉన్న సామగ్రి

జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో..

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన శ్రీపతి రమేష్ ఈ నెల 22న ఓదెల మండలం గుంపులలో ఓ శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. 24న ఉదయం 6.30కు ఇంటికి వచ్చిన రమేష్‌కు మెయిన్ గేట్ తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి ఆందోళనకు గురయ్యాడు. తలుపులు తెరిచి ఉండగా లోనికి వెళ్లాడు. బీరువా తలుపులు తెరుచుకొని ఉన్నాయి. అందులో ఉన్న లక్ష నగదు, 23 వేల రూపాయల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ యువకుడి మృతి



చందు(ఫైల్)

కరీంనగర్ క్రైం/ముస్తాబాద్, జూన్ 24: పెద్దలు ఒప్పుకోరనే భయంతో ఓ ప్రేమజంట పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వారిలో యువకుడు మృతి చెందగా యువతి చికిత్స పొందుతోంది. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన పెంటం చందు(23), అదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఆ యువతి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీన చదువుతోంది. చందు ఆదివారం గూడెం నుంచి యువతిని కలిసేందుకు కరీంనగర్‌కు వచ్చాడు. మధ్యాహ్నం చందు ఫోన్ నుంచి అతడి సోదరుడు నవీన్‌కుమార్‌కు యువతి ఫోన్ చేసి చందు, తాను ప్రేమించుకున్నామని, పెద్దలు ఒప్పుకోరనే భయంతో చనిపోదామని ఇద్దరం నిర్ణయించుకుని కరీంనగర్ ఉజ్వలపార్కు వద్ద పురుగుల మందుతాగామని తెలిపింది. ఒక వ్యక్తి సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చామని చెప్పి ఫోన్ పెట్టేసింది. దీంతో నవీన్‌కుమార్ వెంటనే తన బావతో కలిసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రాగా చందు చికిత్సకు సహకరించడంలేదని వైద్యులు తెలిపారు. వారు ఇద్దరినీ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చందు చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. యువతిని వారి తల్లిదండ్రులు ఎల్లారెడ్డిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాన్ షాప్‌లలో పోలీసుల తనిఖీలు

సిరిసిల్ల క్రైం, జూన్ 24: సిరిసిల్ల పట్టణంలోని పలు పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో సోమవారం పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నారనే సమాచారంపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ రఘుపతి మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నా రు. మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోంద న్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లోగానీ డయల్ 100కుగానీ సమాచారం అందించాలని సూచించారు.



పాన్‌షాప్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పశువుల అంగడిలో వసూళ్ల దందా

జమ్మికుంట, జూన్ 24: జమ్మికుంట మున్సిపాల్టీ పరిధిలో ప్రతి మంగళవారం నిర్వహించే పశువుల అంగడిలో గుత్తేదారు అడ్డగోలు వసూళ్లకు తెరలేపారు. మున్సి పాల్టీకి ప్రతి ఏటా సుమారు 40 లక్షల రూపాయల మేరా ఆదాయం సమకూర్చే అం గడిని అధికారులు గాలికి వదిలేశారు. దీంతో గుత్తేదారు ఆడిందే ఆట పాడిందే పాట గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా బహిరంగ వేలం ద్వారా గుత్తే దారులు అంగడిని దక్కించుకుంటారు. ఏప్రిల్ నుంచి మార్చి వరకు అంగడి దక్కిం చుకున్న గుత్తేదారు పశువులు, మేకలు, గొర్రెలు ఇతర క్రయ విక్రయాలపై ఫీజు వసూలు చేసుకుంటారు. పశువులను వెయ్యి వరకు 30 రూపాయల చొప్పున, ఆపై విక్రయాలకు ఆరు వందల రూపాయలకు మించకుండా వసూలు చేయాలి. గొర్రెలు, మేకలకు వందకు ఐదు రూపాయల చొప్పున వసూలు చేస్తారు. గుత్తేదారు పశువుల విలువలో పది శాతం మేరడబ్బులు వసూళ్లు చేస్తుండటంతో క్రయ, విక్రయదారులు లబోదిబో మంటున్నారు. నిబంధనల ప్రకారం వసూళ్లు జరిగేలా చూడాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

● రశీదు బుక్కులు వెనక్కి ఇవ్వని గుత్తేదారు

అంగడి దక్కించుకున్న గుత్తేదారుడికి మున్సిపాల్టీ అధికారులు స్టాంప్ వేసిన రశీదు బుక్కులు జారీ చేస్తారు. ప్రతి వారం రశీద్ బుక్కుల ద్వారా ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది. రశీదు బుక్ పూర్తి అయిన వెంటనే తిరిగి మున్సిపాల్టీకి అప్పగించాలి. ఇప్పటి వరకు పూర్తి అయిన రశీదు బుక్కులు తిరిగి వెనక్కి ఇవ్వలేదు. రశీదు బుక్కుల్లో కార్బన్ పెట్టకుండా అధికంగా డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి అంగడిలో వసూళ్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

తాట్లవాయి అడవిలో వృద్ధురాలి మృతదేహం

● పెన్షన్ కోసం వెళ్లి మృత్యువాత
● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

రాయికల్, జూన్ 24: రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామానికి చెందిన ఆవుల పోచమ్మ(60) అనే వృద్ధురాలు సోమవారం అడవిలో శవమై కనిపించింది. తాట్ల వాయి, కైరిగూడెం గ్రామాల మధ్య ఉన్న అడవిలో ఈ వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. స్థానికులు, ఏఎస్సై దేవేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోచమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుందని, ఒక్క కూతురు, ఇరువురు కుమారులు ఉండగా, ఈ నెల 19న పెన్షన్ డబ్బులు తీసుకొని వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఏఎస్సై చెప్పారు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం బంధువులు వెతుకున్నారు. అయితే సోమవారం తాట్లవాయి గ్రామస్థులకు అనుమానాస్పద స్థితిలో కుళ్లిపోయిన మృతదేహం తమ గ్రామ శివారులోని అడవిలో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మృతదేహం కుళ్లి పోయి దుర్వాసన వస్తుండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు ఈ శవం పోచమ్మదేనని ఆమె కూతురు గుర్తించిందని ఏఎస్సై తెలిపారు. దీంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు వివరిం చారు. పెన్షన్ డబ్బుల కోసం వెళ్లిన వృద్ధురాలు అడవిలో మృతి చెంది ఉండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు జారి పడటం వల్ల కానీ, మరే ఇతర కారణాల వల్ల చనిపోయి ఉండవచ్చని మృతురాలు కూతురు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశామని తెలిపారు. సంఘటనా స్థలాన్ని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో యూపీ కార్మికుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, జూన్ 24: కరీంనగర్ మానేరు బైపాస్ రోడ్‌లో డీర్‌పార్క్ వద్ద సోమవారం ఉదయం 2.20 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడు సోను అలియాస్ సోను హసన్(26) మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. సోను అతని బంధువులు కలిసి హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా కార్మికులుగా పనిచేస్తున్నారని, సోను ఆదివారం రాత్రి బైక్‌పై అర్జున్, రాజు, శ్యాంకుమార్‌లను వెనుక కూర్చుండబెట్టుకుని డ్యాంకట్టపైకి వెళ్లి అక్కడే భోజనం చేసి తిరిగి బైక్‌పై హనుమాన్ నగర్‌కు వస్తుండగా అతివేగంగా వీధి దీపాల స్తంభానికి బైక్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రగాయాలతో సోను అక్కడికక్కడే మృతి చెందగా గాయాలైన అర్జున్, రాజు, శ్యాంకుమార్‌లను 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

వ్యక్తి పరిస్థితి విషమం

ఎండపల్లి, జూన్ 24: జగిత్యాల జిల్లాలోని ముంజంపల్లి గ్రామంలో ఓ ఆర్టీసీ బస్సు బైక్‌ని సోమవారం రాత్రి ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి కాలు నుజ్జు నుజ్జు అయింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంజంపల్లి గ్రామానికి చెందిన సట్ల రాజయ్య అటవీశాఖలో వాచర్‌గా పని చేస్తున్నాడు. పని పూర్తి చేసుకుని కుక్కలగూడూర్ వైపు నుంచి ముంజంపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ధర్మారం నుంచి గోదావరిఖని వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు చెట్ల కొమ్మలు బస్సుకు అడ్డు రావడంతో స్టీరింగ్‌ను తిప్పడంతో అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రాజయ్య కాలు నుజ్జు నుజ్జు అయి తీవ్ర రక్తస్రావం అయింది. చేతికి కూడా తీవ్ర గాయమైంది. సంఘటనా స్థలంలో ఉన్న వారు వెంటనే రాజయ్యను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉంది.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 24: సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాలకు చెందిన దాసరి రమ (33) అనే వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పూసాల గ్రామానికి చెందిన దాసరి రమను 15 ఏళ్ల క్రితం గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీశైలంకు ఇచ్చి వివాహం జరిపించారు. తగిన కట్న కానుకలతో పాటు ఉపాధి కోసం ఆటో ఇచ్చారు. కొంతకాలం కాపురం అనంతరం మరో ఐదు లక్షల రూపాయలను ఆదనంగా కట్నం కింద తేవాలంటూ రమను వేధింపులకు గురి చేశాడు. దీంతో రమ పుట్టింటికి వెళ్లగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి నచ్చచెప్పారు. అయినా భర్త శ్రీశైలం, అత్త దాసరి కొమురమ్మ, తోటి కోడలు లక్ష్మి కలిసి రమను అనేక మాటలతో వేధించారన్నారు. దీంతో మనస్తాపం చెందిన రమ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు రమ సోమవారం మృతి చెందింది. రమకు కూతురు, కొడుకు ఉన్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

ధూళికట్టలో వ్యక్తి అదృశ్యం



తిరుపతియాదవ్ (ఫైల్)

ఎలిగేడు, జూన్ 24: మండలం లోని ధూళికట్ట గ్రామానికి చెందిన కొండ తిరుపతియాదవ్ (40) ఈ నెల 22న ఉదయం నుంచి కనిపిం చడం లేదని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి యాదవ్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సెల్‌ఫోన్ సైతం ఇంట్లోనే పెట్టి వెళ్లాడన్నారు. సాయంత్రం వరకు చూసినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని బంధువులు, కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాలేదన్నారు. సుమారు 5.6అడుగుల ఎత్తు ఉండి తెలుపు రంగులో ఉన్నాడని తెలిపారు. తిరుపతి ఇంట్లో నుంచి వెళ్లినప్పుడు తెలుపు రంగు షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని వివరించారు. తిరుపతికి వరుసకు అన్న అయిన కొండ కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



గంగారాం (ఫైల్)

కోరుట్ల రూరల్, జూన్ 24: మండలంలోని సర్పరాజుపూర్ గ్రామంలో సోమవారం 11 కేవి విద్యుత్‌తీగ తగిలి ఓ వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొక్కునడిపి గంగారాం(60) రెండు రోజుల క్రితం కురిసిన గాలి వానతో ఇంటి ముందున్న రేకుల షెడ్ కొంత మేర ధ్వంసం అయింది. వాటిని సరి చేయడానికి సోమవారం షెడ్‌పైకి ఎక్కి రేకులను సరి చేస్తూ వాటిపై తాడిపత్రి కప్పుతున్న సమయంలో విద్యుత్ తీగలకు తగిలి షాక్ కొట్టడంతో గంగారాం షెడ్‌పైనే కుప్పకూలి గంగారాం అక్కడిక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో పోలీసులకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గంగారాం భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

కొడిమ్యాల, జూన్ 24 : మండలంలోని తిర్మాలాపూర్ గ్రామానికి చెందిన అవునూరి విష్ణువర్ధన్‌ను గాయపర్చిన అదే గ్రామానికి చెందిన ఉల్లెందుల అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు విష్ణువర్ధన్ ఆదివారం రాత్రి ఒంటరిగా వెలుతుండగా అంజయ్య కత్తితో దాడి చేయడంతో చాతికి ఎడమ చేతికి గాయాలయ్యాయి. పాత పగలను మనుసులో పెట్టుకొని చంపాలనే ఉద్దేశంతో దాడి చేశాడని గాయాలైన అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి తండ్రి అవునూరి వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ


చికిత్స పొందుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమ

మంథని, జూన్ 24: వివిధ ఆరోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి నాణ్యమైన వైద్యం అందించాలని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆమె పరిశీలించి పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆసుపత్రి వచ్చే వారికి మెరుగైన వైద్యంతోపాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు అధిక సంఖ్యలో పేదవారే వస్తారని, వాళ్లను చూసుకునే బాధ్యత మనపై ఉందన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీ దుద్దిల్ల శ్రీధర్‌బాబు సహాయ సహకారాలతో మంథని ప్రాంత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కలిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నక్క నాగేంద్ర-శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

నాణ్యమైన వస్తువులనే కొనుగోలు చేయాలి

● అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిటౌన్, జూన్ 24: భారతీయ ప్రమాణాలు, నాణ్యమైన వస్తువులనే అధికారులు కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ జీ.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భారతీయ ప్రమాణాలు, నాణ్యత వివరాలపై జిల్లా అధికారులకు బీఐఎస్ ప్రతినిధులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. బీఐఎస్ ప్రతినిధులు జిల్లా అధికారులకు నాణ్యత వివరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో చేసే టెండర్లు అభివృద్ధి పనుల నిమిత్తం సామగ్రి కొనుగోలు సమయంలో తప్పనిసరిగా భారతీయ ప్రమాణాలను పాటించాలని, నాణ్యమైన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేస్తున్న వస్తువులపై ఐఎస్ఐ ముద్రను గమనించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన పరికరాలను గుర్తించేందుకు బీఐఎస్ కేర్ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. బంగారం కొనుగోలు సమయంలో నాణ్యతను పరిశీలించాలని, హాల్‌మార్క్ హెచ్‌యూఐడి 6 సంఖ్యల నెంబర్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించారు.ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ కొనుగోలు సమయంలో ఆర్‌యూసి. నెంబర్ పరిశీలించాలన్నారు. సమావేశంలో బీఐఎస్ సంచాలకులు పి.వి. శ్రీకాంత్, సంయుక్త సంచాలకులు సవిత, ఎసీఓ అభిసాయి పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

పెద్దపల్లిటౌన్, జూన్ 24: జిల్లాలో నిర్వహించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం ఆరు దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా పరిష్కరించినట్లు పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్ తెలిపారు. సోమవారం జిల్లాలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయాలు, సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సెక్షన్ కార్యాలయాల్లో నాలుగు దరఖాస్తులు, సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంలో రెండు దరఖాస్తులు ప్రజావాణి క్రింద స్వీకరించామన్నారు. విద్యుత్ వినియోగదారులు ప్రతి సోమవారం నిర్వహించే విద్యుత్ ప్రజావాణిలో పాల్గొని సమస్యలు ఉంటే తెలియజేయాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని, వినియోగదారులు బకాయి ఉన్న కరెంటు బిల్లులు సకాలంలో చెల్లించి విద్యుత్ సంస్థ పురోగతికి దోహదపడాలని కోరారు.

ఫిర్యాదుల కోసం మున్సిపల్‌లో కంట్రోల్ రూం

పెద్దపల్లిటౌన్, జూన్ 24: వర్షాకాలం దృష్ట్యా పట్టణంలో ఎలాంటి సమస్యలు ఏర్పడినా కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయాలని కమిషనర్ ఆకుల వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్ల సమస్యలు, తాగునీటి, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ సమస్యలు తలెత్తితే వెంటనే ఫోన్. 6303127484కు కాల్ చేయాలని సూచించారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో నిబంధనలు పాటించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ కె ప్రమోద్ కుమార్

పెద్దపల్లిటౌన్, జూన్ 24: ప్రైవేటు ఆసుపత్రులు, డయోగ్నస్టిక్స్ సెంటర్ల యాజమాన్యాలు ప్రభుత్వం నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010పై నిర్వహించిన అవగాహన సమావేశంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ (టి.బి) డాక్టర్ ఎ.రాజేశంతో కలిసి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ (టి.బి) డాక్టర్ ఎ. రాజేశం మాట్లాడుతూ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేట్ హాస్పిటల్స్, డయోగ్నస్టిక్స్ సెంటర్‌లలో సిబ్బందికి, అధికారులకు అవగాహన కల్పించి తీసుకోవాల్సిన చర్యలపైన పలు సూచనలు చేశారు. అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్‌లో చార్జీల పట్టిక, అందించబడే సేవలు, డాక్టర్లు, సిబ్బంది పేర్లతో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఫైర్ సేఫ్టీ పాటించాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ తప్పకుండా ఉండాలని సూచించారు. జిల్లాలోని అన్ని హాస్పిటల్‌లను రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలని, రిజిస్ట్రేషన్ చేయించుకోని వారికి నోటీసులు ఇవ్వడం, పెనాల్టీ విధించడం, అవసరమైతే సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వి. వాణిశ్రీ, డాక్టర్ కె.వి.సుధాకర్ రెడ్డి, డాక్టర్ మధుకర్ రెడ్డి, రాష్ట్ర సిఈఏ సెల్ సభ్యుడు వేణు ప్రసాద్, డిప్యూటీ డెమో ఎస్. వెంకటేశ్వర్లు, ఎంపిహెచ్ఓ టి.రాజేశం, ఎల్.టి వి.శ్రీనివాస్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో రేపు పాఠశాలల బంద్

పెద్దపల్లిటౌన్, జూన్ 24: పాఠశాలల సమస్యలు పరిష్కరించాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం బంద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యిందన్నారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి


మట్టినమూనాలను సేకరిస్తున్న రైతులు, అధికారులు

ఎలిగేడు, జూన్ 24: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రత్యూష తెలిపారు. సోమవారం మండలంలోని జూలపల్లి గ్రామంలో భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. రైతులు తమ పంటపొలాల్లో విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సంవత్సరం వ్యవసాయ శాఖ ద్వారా జూలపల్లి మండలంలో రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. మండలంలోని ఏఈఓలు గ్రామాల వారీగా 5ఎకరాలకు ఒక మట్టి నమూనా చొప్పున 4088 నమూనాలను సేకరించడం జరుగుతుందని మట్టి నమూనాలను పరీక్షించిన తర్వాత ఎరువులు ఎంత మోతాదులో వేసుకోవాలో తెలుస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాకేష్, రైతులు గడ్డం రాంరెడ్డి పాల్గొన్నారు.

కాళేశ్వరం బ్యారేజీకి మరమ్మతులు చేయాలి

కళ్యాణ్‌నగర్, జూన్ 24: కాళేశ్వరం బ్యారేజీ పగుళ్లకు మరమ్మతులు చేయించాలని బీజేపీ చెన్నూరు అసెంబ్లీ ప్రభారి క్యాతం వెంకటరమణ సోమవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం కాసులకు కక్కుర్తిపడి గోదావరిపై నాణ్యత లేకుండా ప్రాజెక్టు నిర్మించి వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల ప్రాజెక్టులు క్యూరింగ్ లేకుండా నిర్మించడంతో బీటలు వారాయని అన్నారు.

యథేచ్ఛగా 'బొక్కలవాగు' భూముల కబ్జా

- విలువైన భూమిలో రాత్రికిరాత్రే నిర్మాణాలు
- రాజకీయ నాయకుల హస్తం.. పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బోయినిపేట వాసులు

మంథని, జూన్ 24: మంథని పట్టణాన్ని అనుకొని ప్రవహిస్తున్న బొక్కలవాగు నద్దినాలా(పరివాహక) భూములను యథేచ్ఛగా కొందరు కబ్జా చేస్తున్నారు. మంథని-పెద్దపల్లి నాలుగులైన్ల ప్రధాన రహదారికి అతి సమీపంలో ఉన్న విలువైన బొక్కవాగు నద్దినాలా భూములను హస్తగతం చేసుకునేందుకు కొందరు రాజకీయ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారు. గుంటకు లక్షల్లో విలువ చేసే ఈభూములను ఆక్రమించుకోవటానికి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న వాగుఒడ్డు పోచమ్మ, నల్ల పోచమ్మ గుడుల వెనుక వైపు ఉన్న స్థలంలో కొందరు రాత్రికిరాత్రే తవ్వి సిమెంట్ ఇటుకలతో పునాదులు నిర్మించారు. దాదాపు 20 గంటల వరకు బహిరంగ మార్కెట్‌లో కోట్లలో విలువ చేసే బొక్కలవాగు నద్దినాలా భూములను కబ్జా చేసేందుకు కొందరు రాజకీయ నాయకులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈభూములు పూర్తిగా బొక్కలవాగు నద్దినాలా భూములుగా ఉన్నపట్టికీ, గతంలో ప్రస్తుతం అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్న స్థలానికి అతిసమీపంలో సైతం కొందరు ప్రజాప్రతినిధులు సైతం కబ్జా చేయటానికి ప్రయత్నాలు చేశారు. మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారికి పక్కనే ఉండటంతో బహిరంగ మార్కెట్‌లో గుంటకు లక్షల్లో ధర పలుకుతుండటంతో భూమలను ఆక్రమించుకోవటానికి, అక్రమ నిర్మాణాలు తరుచూ యథేచ్ఛగా జరుగుతున్నప్పటికీ మున్సిపల్, రెవెన్యూ, ఐబీ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఈవిషయంలో కొందరు నేతలు తమకు ఉన్న రాజకీయ అండదండలతో అధికారులను సైతం బెదిరింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. గతంలో, ప్రస్తుతం బొక్కలవాగు నద్దినాలా భూముల్లో కబ్జాలను బోయినిపేట వాసులు అడ్డుకుంటున్నారు. ఇప్పటికైనా వివిధ ప్రభుత్వ శాఖల జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి విలువైన బొక్కలవాగు నద్దినాలా భూములు కబ్జాలకు గురికాకుండా రక్షించాలని, వాగునీటి ప్రవాహానికి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు పట్టణ ప్రజలకు కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కబ్జాకు గురైన బొక్కలవాగు నద్దినాలా భూములు

● **మాన్యం భూములు కబ్జా చేస్తే సహించేది లేదు..**

పోచమ్మగుడి మాన్యం భూములను కబ్జా చేస్తే సహించేది లేదని మంథని మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు పోతరవేని క్రాంతికుమార్, నాయకులు పోతరవేని లక్ష్మీరాజం(అర్జున్), నబ్బని సమ్మయ్య, పోలు కనకరాజు హెచ్చరించారు.

పెద్దపల్లి రహదారిని ఆనుకొని ఉన్న పోచమ్మ దేవాలయాన్ని తరతరాలుగా బోయినిపేటలోని తెనుగుగూడెం, గొల్లగూడెం, దుబ్బగూడెం, గంగాపురి, మంథని ప్రజలు ఆరాధ్య దైవంగా భావిస్తూ స్థలాన్ని అతి పవిత్రంగా చూసుకుంటున్నామన్నారు. కొంతమంది రాజకీయ అండదండలతో పోచమ్మ గుడి మాన్యానికి సంబంధించిన బొక్కల వాగును ఆనుకుని ఉన్న భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేశారన్నారు. ఇకమీదట ఎవరైనా గుడి జోలికి వచ్చినా గుడి స్థలాల జోలికి వచ్చినా సహించేది లేదన్నారు. కబ్జాలు జరగకుండా ఉండాలంటే ప్రభుత్వం చొరవ తీసుకొని ఆ గుడి మాన్యానికి ప్రహరీ గోడ నిర్మించి వనభోజనాలకు తగిన సౌకర్యాలు చెట్లను పెంచడం నీటి వసతి ఏర్పాటు చేసి పోచమ్మ గుడి అభివృద్ధి చేసే విధంగా ప్రణాళిక రచించాలని వారు కోరారు.

ఆపద సమయంలో పోలీసులను ఆశ్రయించండి: సీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారెడ్డి

సుల్తానాబాద్, జూన్ 24: విద్యాసంస్థలకు వెళ్లి వచ్చే విద్యార్థినిలు, యువతులు, ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న మహిళలు, గృహిణిలు ఆపద సమయాల్లో పోలీస్ శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి సూచించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థినిలకు షీ టీమ్స్ తదితర మహిళల భద్రత రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సేవలను, టోల్‌ఫ్రీ నంబర్ సేవలను వివరించారు. అత్యవసర సమయాల్లో ఆయా సేవలను ఉపయోగించుకుని పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకుని ఆపదల నుంచి బయటపడాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ అందుబాటులో ఉంచిన సేవల గురించి ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తదితరులు వివరించారు.

ఎలిగేడు: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై గౌరవం కలిగి ఉండాలని జూలపల్లి ఎస్సై శ్రీధర్ సూచించారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలు, మద్యపానానికి దూరంగా ఉండాలని చెప్పారు. చదువుకున్న పాఠశాలకు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు చదువు, ఆటలపై శ్రద్ధ వహించాలని వివరించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రకాల సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సైబర్ మోసాల గురించి వివరించారు.

● **సైబర్ నేరాలపై అవగాహన..**

ఓదెల: సెల్ ఫోన్ వినియోగదారులు ఆపరేటింగ్‌పై అవగాహనతో అప్రమత్తంగా ఉంటేనే, తమ బ్యాంకు ఖాతాల్లోని డబ్బుకు భద్రత ఉంటుందని సైబర్ క్రైమ్ ట్రైనర్ రాజేందర్, ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మండలంలోని వివిధ గ్రామాల వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుధాకర్, ట్రైనర్ రాజేందర్ మాట్లాడుతూ, గుర్తుతెలియని వెబ్‌సైట్ లింకులను ఓపెన్ చేయవద్దని, గుర్తుతెలియని లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్, పాన్ కార్డు, బ్యాంకుల వివరాలు అడిగితే చెప్పి మోసపోవద్దని తెలిపారు. ఆన్‌లైన్ జూదానికి యువత బానిసై ఆర్థికంగా నష్టపోతున్నారని జూదానికి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పొత్కపల్లి పోలీస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం


ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోదావరిఖని/మంథని/ధర్మారం/కమాన్‌పూర్ జూన్ 24: కాంగ్రెస్ పార్టీలో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ బీఆర్ఎస్ పార్టీని మోసం చేశాడంటూ సోమవారం గోదావరిఖని చౌరస్తాలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే కమాన్‌పూర్, మంథని, ధర్మారంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించి, డబ్బులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకుంటున్నారని, జగిత్యాల నియోజకవర్గ ప్రజలు కేసీఆర్ ముఖం చూసి సంజయ్‌ని గెలిపించారన్నారు. కానీ సంజయ్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారని, దమ్ముంటే సంజయ్ కుమార్ రాజీనామా చేసి గెలువాలని సవాల్ విసిరారు. సంజయ్ పార్టీ మారడాన్ని నిరసిస్తూ గడపగడపకు వెళ్లి సంజ్‌చేసిన మోసాన్ని వివరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి ఉష, కార్పొరేటర్లు పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణవేణి, ఐత శివ, కమాన్‌పూర్ మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మహిళ మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, సిద్దిమల్లె మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, ధర్మారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్. సీనియర్ నాయకులు పూస్కూరి జితేందర్‌రావు, బుచ్చిరెడ్డి, మంథని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల సీజ్

కోల్‌సిటీటౌన్, జూన్ 24: గోదావరిఖని సప్తగిరికాలనీలో ప్రభుత్వ అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఓ కార్పొరేట్ పాఠశాలను రామగుండం మండల విద్యాధికారి రాజయ్య సోమవారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా సప్తగిరికాలనీలో పాఠశాల బ్రాంచిని కొనసాగిస్తున్నారని ఫోన్ ద్వారా కలెక్టర్‌కు విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేశాయి. ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ సంఘాల నాయకులు పాఠశాల ఆవరణలో ఆందోళన చేశారు. కాగా ఎంఈవో పాఠశాలకు చేరుకొని సీజ్ చేశారు. సంబంధిత పాఠశాల ప్రిన్సిపల్‌ను అనుమతులకు సంబంధించిన పత్రాలను అడుగగా చూపించకపోవడంతో డీఈవోకు తెలియజేశామని ఎంఈవో తెలిపారు. దీంతో డీఈవో ఆదేశాల మేరకు పాఠశాలను సీజ్ చేసినట్టు ఎంఈవో తెలిపారు.

నేడు రైతు నేస్తం కార్యక్రమం

కమాన్‌పూర్, జూన్ 24 : మండలంలోని గుండారంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతు నేస్తం కార్యక్రమం జరగనున్నట్లు మండల వ్యవసాయాధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వానకాలం సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించనున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వనమహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 24: వానాకాలంలో చేపట్టనున్న వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలని ఎంపీవో సుదర్శన్ అన్నారు. సోమవారం మండలంలోని కనగర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మొక్కలు ఎండి పోకుండా నీరు అందించాలని సూచించారు. వారి వెంట ఈజీఎస్ జేఈ రాజయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీలత తదితరులు ఉన్నారు.

26న క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

సుల్తానాబాద్, జూన్ 24: తెలంగాణ క్రీడా పాఠశాలలో 2024 -25 విద్యా సంవత్సరానికి గాను నాలుగో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 26న సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 26న నిర్వహించే ఈ ఎంపిక పోటీల్లో 1 సెప్టెంబర్ 2015 నుంచి 31 ఆగష్టు 2016 మధ్యన జన్మించిన వారై ఉండాలని, నాలుగో తరగతి చదువుతూ ఉండాలని సూచించారు. ఈ నెల 26న ఉదయం 9 గంటలకు హాజరు కావల్సిందిగా కోరారు. మిగతా వివరాలకు 9490674874 నెంబర్ ద్వారా డి రమేష్ రేగడిమద్దికుంట పీఈటీని సంప్రదించాలని ఎంఈఓ తెలిపారు.

కమాన్‌పూర్: క్రీడ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 26న క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి టీ. సురేందర్‌కుమార్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ధర్మారం, జూన్ 24: ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేయడంపై సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్మారంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటాలకు నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రుణ మాఫీ ప్రకటించిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చింతల జగన్‌మోహన్ రెడ్డి, కాంపెల్లి రాజేశం, దేవి జనార్దన్, కొత్త నర్సింహులు, పాలకుర్తి రాజేశం, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్

మంథని, జూన్ 24: క్రీడలతో విదార్థులు విద్యాలో సైతం రాణించాలని ఎంపీపీ కొండ శంకర్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్‌లు సూచించారు. మండల స్థాయి క్రీడా పాఠశాల కోసం విద్యార్థులను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం నిర్వహించారు. క్రీడాకారుల ఎంపిక పోటీలను వారు జెండా ఊపి ప్రారంభి అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడల వలన స్నేహభావం పెరుగుతుందని, క్రీడలతో మానసిక ఉల్లాసం కల్గుతుందన్నారు. జిల్లా స్థాయిలో సైతం మంథని ప్రాంతానికి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. ఈపోటీలో అధికంగా పాయింట్లు సాధించిన 10 మంది విద్యార్థులను ఈనెల 27, 28వ తేదీల్లో పెద్దపల్లి జరిగే జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపిస్తామని ఎంఈవో దాసరి లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కో-ఆర్డినేటర్ కొమురోజు శ్రీనివాస్, హెచ్ఎం శ్రీదేవి, పీఈటీలు డాక్టర్ దొమ్మటి రవి, వల్లంభట్ల శ్రీనివాస్, సమ్మయ్య, మాధురి, సీఆర్పీలు మల్లయ్య, స్వప్న.

ముత్తారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 2024-25 సంవత్సరానికి గాను క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి ఎంపికకు క్రీడలను సోమవారం మండల ఎంఈవో లక్ష్మి ప్రారంభించారు రెండు రోజులు జరిగే ఈ క్రీడల్లో గెలుపొందిన వారిని జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొనవలసి ఉంటుంది అందులో ఎంపికైన వారు క్రీడా పాఠశాలకు అర్హులవుతారని తెలిపారు.

సింగరేణి నైనీ ప్రాజెక్టుకు పూర్తి సహకారం

- అటవీ భూమి బదలాయింపునకు అన్ని చర్యలు - సీఎండీ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఒడిశా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి

గోదావరిఖని, జూన్ 24: సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో చేపట్టిన నైనీ బొగ్గు గని నుంచి ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం చివరి నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ బొగ్గు ఉత్పత్తి ప్రారంభమయ్యే విధంగా, అలాగే నైనీ సమీపంలో నిర్మించతలపెట్టిన థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలం గుర్తింపు కోసం సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒడిశాలో ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనాతో ప్రత్యేకంగా సమావేశమై నైనీ బ్లాక్‌కు సంబంధించి అన్ని అనుమతులు లభించిన విషయాన్ని, అలాగే రెండో దశ అటవీ అనుమతుల్లో పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా సింగరేణి చర్యలు తీసుకుందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా వన్యప్రాణి నిర్వహణ ప్రణాళికలో పొందుపరిచినట్లుగా రూ.39 కోట్లను కూడా డిపాజిట్ చేశామని, దీంతో ఇప్పటి వరకు రూ.180 కోట్లను పూర్తిగా ప్రభుత్వానికి చెల్లించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు ప్రారంభం కోసం కావాల్సిన 783 హెక్టార్ల అటవీభూమిని సింగరేణికి బదలాయించాలని కోరారు. సింగరేణి ఆధ్వర్యంలో నైనీ ప్రాజెక్టుకు సమీపంలో 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా మాట్లాడు తూ సింగరేణి నైనీ ప్రాజెక్టు నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలను పూర్తిగా అందజేస్తామని హామీ ఇచ్చారు. అటవీ భూమిని వీలైనంత త్వరగా అప్పగించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

అనంతరం ఆయన ఒడిశా రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఒడిశా ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఇడ్కో) ఛైర్మన్ హేమంత్ శర్మను కలిశారు. సింగరేణి త్వరలోనే నైనీ నుంచి బొగ్గు ఉత్పత్తి చేపట్టనుందని, అయితే ఈ బొగ్గును సింగరేణి థర్మల్ విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో నైనీ గనికి 50 కిలోమీటర్ల దూరంలోనే 1600 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు, ఇందుకోసం సింగరేణి ఉన్నతాధికారుల బృందం గతంలో ఒడిశాలో పర్యటించి నాలుగు ప్రదేశాలను పరిశీలించిందని వివరించారు. 800ఎకరాల స్థలం అవసరం ఉంటుందన్నారు. సంబంధిత భూములకు సంబంధించిన ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం కావాలని కోరారు. దీనిపై స్పందించిన హేమంత్‌శర్మ సింగరేణి పరిశీలించిన స్థలాలపై ఇడ్కో సీజీఎం(ల్యాండ్) సరోజ్‌కుమార్ సేథీతో మాట్లాడారు. సింగరేణికి సహకారం అందించాలని సూచించారు.


ఒడిశా సీఎస్‌తో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

అనంతరం ఒడిశాలో ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ సుశాంత్ నందాను సింగరేణి సీఎండీ కలిశారు. అటవీ భూమిని బదలాయించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం సింగరేణి సీఎండీ మాట్లాడుతూ అటవీ భూమి బదలాయింపు జరిగితే మూడునెలల్లో బొగ్గు ఉత్పత్తి మొదలవు తుందని పేర్కొన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ ప్లాంట్‌ను ఒడిశా లో ఏర్పాటు చేస్తే సంస్థకు ఆర్థికంగా ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. సీఎండీ వెంట నైనీ జీఎం తుమ్మలపల్లి శ్రీనివాసరావు, జీఎం (ఎస్టేట్స్) బండి వెంకటయ్య, చీఫ్‌ఆఫ్ పవర్ ప్రాజెక్ట్స్ విశ్వనాథరాజు, ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్ మజుందార్, ఎస్ఈ(మైనింగ్) ప్రవీణ్ కశ్యప్ ఉన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 24: కారుణ్య నియామక ప్రక్రియలో భాగంగా ఆర్జీ-2 పరిధిలో పనిచేస్తూ మరణించిన, మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన 16 మంది మాజీ ఉద్యోగుల వారసులకు సోమవారం జీఎం సూర్యనారాయణ నియామక పత్రాలన అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియామకపత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అందరికి ఏరియా పరిధిలో పోస్టింగ్ ఇస్తున్నట్టు జీఎం తెలిపారు. సింగరేణిలో ఉద్యోగం అంటే అదృష్టంగా భావించాలని, చిత్తశుద్ధితో పనిచేస్తూ క్రమశిక్షణ గల ఉద్యోగిగా గుర్తింపు తెచ్చుకోవాలని జీఎం సూచించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, అధికారులు రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, వంశీధర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యూటీ చెల్లించాలి

గోదావరిఖని, జూన్ 24: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యూటీ వెంటనే చెల్లించకపోతే ఆందోళనలు చేపడతామని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్(టీఎన్‌టీయూసీ) నాయకులు నిమ్మకాయల ఏడుకొండలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సహాయ కార్మిక కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ 2016 నుంచి 2018 మధ్యకాలంలో రిటైర్డ్ అయిన కార్మికులకు పెరిగిన గ్రాట్యూటీని చెల్లించడం లేదన్నారు. దీంతో సుమారు 3816 మంది కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంపై వెంటనే యాజమాన్యం స్పందించి గ్రాట్యూటీని రిటైర్డ్ కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మణిరామ్ సింగ్, ముదిగంటి దామోదర్‌రెడ్డి, పెగడపల్లి రాజనర్సు, సుందిళ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ధర్మపురి

రామగిరి జూన్ 24: ఏపిఏ ఏరియా ఏఎల్‌పి ఎస్‌సీఎంఎల్‌యూ-ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర మినిమం వేజ్ బోర్డు కమిటీ చైర్మన్ బి జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సెంట్రల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ధర్మపురి హాజరై మాట్లాడారు. సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌టీయూసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడతామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కారుణ్య నియామకాలు, 35 నుంచి 40 సంవత్సరాలు వయోపరిమితిని పెంచడం ఐఎన్‌టీయూసీ వల్లనే సాధ్యమైందని తెలిపారు. రాబోయే రోజుల్లో కొత్త అండర్ గ్రౌండ్లు, కొత్త రిక్రూట్‌మెంట్‌తో ఉద్యోగాలను పెంచే విధంగా సింగరేణి భవిష్యత్ ఉండే విధంగా ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని అన్నారు.

ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏఎల్‌పీలో 40 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. అదేవిధంగా నూతనంగా మరుగుదొడ్లు కట్టించడానికి సాంక్షన్ తీసుకోవడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి మందల కొమురయ్య, బ్రాంచ్ కార్యదర్శి సాయి కృష్ణ, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరి కోలా అనిల్, అసిస్టెంట్ పిట్ సెక్రటరి ఎమ్ వెంకటేష్, ప్రచార కార్యదర్శులు హరికృష్ణ ఎండి జుబేర్ మైండ్ కమిటీ సేఫ్టీ కమిటీ సభ్యులు రంగయ్య రాయమల్లు నరేందర్, సంపత్, నారాయణ, శంకర్ మరియు నాయకులు పాల్గొన్నారు